క్లుప్తంగా

కాకాణికి సత్కారం



ఇందుకూరుపేట: మండలంలోని పున్నూరులో ఉన్న ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ నివాసానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం విచ్చేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు కాకాణిని ఘనంగా సత్కరించి, పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావాలని కోరారు. ఆయన వెంట పార్టీ నేతలు బాలబొమ్మ కరుణాకర్, చిట్టిబోయిన కృష్ణప్రసాద్, తన్నీరు మహేష్, ముంగుర రమణయ్య, తన్నీరు సునీల్ ఉన్నారు.

బాబా మందిరంలో విశేష పూజలు

పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామివారి పల్లకి సేవ నిర్వహించారు.

నెల్లూరు ఆర్డీఓ పర్యటన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ అనూష

తోటపల్లిగూడూరు: నెల్లూరు ఆర్డీఓ అనూష గురువారం మండలంలోని వరిగొండ, తోటపల్లిగూడూరు బిట్ – 2 గ్రామాల్లో పర్యటించారు. భూ క్రమబద్ధీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా గుర్తించేందుకు ప్రభుత్వం భూ క్రమబద్ధీకరణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన భూములను వెంటనే క్రమబద్ధీరించాలన్నారు. రికార్డుల పరంగా ఇబ్బందులున్న భూముల గురించి తమ దృష్టి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ కృష్ణప్రసాద్, టీడీ శివయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిఘా నేత్రం వెంటాడుతోంది

- నేరాల కట్టడిలో డ్రోన్స్ ఆన్ డ్యూటీ
- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం
- బహిరంగ మద్య సేవనంపై 48 కేసులు
- 12 మంది జూదరుల అరెస్ట్



డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న నగర డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్): కొంతకాలంగా నెల్లూరు నగరంలో అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు పెరిగిపోయాయి. ఏరులై పారుతున్న మద్యం వల్ల శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడుతోంది. వీటిని కట్టడి చేసేందుకు ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు నగర డీఎస్పీ పి.సింధుప్రియ పటిష్ట చర్యలు చేపట్టారు. నగరంలో నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు అధికంగా జరిగే ప్రదేశాలు, శివారు ప్రాంతాలను డ్రోన్ల నిఘా నీడలోకి తీసుకొచ్చారు. తాము వెళ్లలేని ప్రాంతాలకు డ్రోన్లను పంపి పరిశీలిస్తున్నారు. బహిరంగ మద్యసేవనం, గంజాయి వినియోగం, పేకాట, గంజాయి విక్రయాలు, అక్రమరవాణా, ఈవ్‌టీజింగ్‌పై కొరడా ఝుళిపిస్తున్నారు. డ్రోన్ల శబ్దం విన్న మందుబాబులు, అక్రమార్కులు పరుగులు తీస్తున్నారు. మరోవైపు పాడుబడిన బంగ్లాలు, తోటలు, పార్కులు, నదీతీర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో పలు చిత్రాలు తీసి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తున్నారు.

కేసుల నమోదు ఇలా..

నగరంలో డ్రోన్ల సాయంతో అసాంఘిక కార్యకలాపాలకు పోలీసులు చెక్ పెడుతున్నారు. బుధవారం నుంచి ఇప్పటి వరకు బహిరంగ మద్యసేవనంపై 48 కేసులు నమోదు చేసి మందుబాబులను అరెస్ట్ చేశారు. రెండు పేకాట స్థావరాలపై దాడులు చేసి 12 మంది జూదరులను అరెస్ట్ చేశారు. గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈవ్‌టీజర్లను అదుపులోకి తీసుకుని వారికి తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలు, నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.



డ్రోన్‌తో పరిశీలిస్తున్న దృశ్యం

హైవేపై దోచేస్తున్నారు

- హడలిపోతున్న లారీ డ్రైవర్లు
- దాడులకూ పాల్పడుతున్న దొంగలు
- పట్టించుకోని పోలీసులు

కొడవలూరు పరిధిలోని జాతీయ రహదారిపై నానాటికీ చోరీలు పెరిగిపోతున్నాయి. లారీ డ్రైవర్లు వాహనాన్ని ఆపి సేద తీరుతున్న సమయంలో వారి జేబులు ఖాళీ అవుతున్నాయి. కొందరైతే దాడి చేసి మరీ డబ్బులు లాక్కొని వెళ్తున్నారు. నగదు పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే బాధితులను పట్టించుకునే వారు కరువయ్యారు.



నందలగుంట వద్ద ఖాళీ స్థలంలో ఆగిన లారీ

కొడవలూరు: మండలంలోని రాచర్లపాడు మొదలుకొని కోవూరు సాయిబాబా గుడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు జాతీయ రహదారిపై చోరీలు పెరిగిపోయాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా చెన్నై వైపు వెళ్లే లారీల డ్రైవర్లు రేగడిచెలిక, కమ్మపాళెం పెట్రోల్ బంకులు, నాయుడుపాళెం, కోవూరు నందలగుంట వద్ద ఉన్న ఖాళీ స్థలాల్లో వాహనాలను నిలిపి కునుకు తీస్తుంటారు. అలాగే కావలి వైపు వెళ్లే వాహనాలైతే నార్తురాజుపాళెం ఆంజనేయస్వామి గుడి, నాయుడుపాళెం పెట్రోలు బంకు, చంద్రశేఖరపురం వద్దున్న ఖాళీ స్థలాల్లో నిలుపుకొని సేదతీరుతారు. ఇలా వారు కునుకుతీసి లేచాక జేబులు చూసుకొంటే ఖాళీ అవుతున్నాయి. ఇలా కొన్ని సందర్భాల్లో డ్రైవర్ మేలుకొంటే దాడికి పాల్పడి గాయపరిచి దోచుకుపోతున్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వస్తే పట్టించుకోవడం లేదు.

కేసులు కట్టరు

నగదు చోరీకి గురైతే కొడవలూరు, కోవూరు పోలీస్‌స్టేషన్‌లకు వెళ్తే లారీ డ్రైవర్‌ల నుంచి ఫిర్యాదులు తీసుకునే నాథుడే లేకుండాపోయారు. అనధికారికంగా ఓ తెల్ల కాగితంపై లారీ డ్రైవర్ పేరు, చోరీకి గురైన నగదు వివరాలు, అడ్రస్‌లు రాసుకొని దొంగ దొరికితే ఫోన్‌లో సమాచారం ఇస్తామని చెప్పి తిప్పి పంపేస్తున్నారు. అంతేకానీ ఎట్టి పరిస్థితుల్లోనూ కేసులు నమోదు చేయడం లేదు. దూరపు ప్రాంతాల నుంచి వచ్చే డ్రైవర్‌లు కావడంతో పోలీసులను గట్టిగా అడిగే సాహసం కూడా చేయలేకపోతున్నారు. కొందరైతే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదని భావించి లారీ యజమానికి సమాచారం అందించి వెళ్తున్నారు. ఇలాంటి ఘటనలు ప్రతి నిత్యం కొడవలూరు, కోవూరు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో చోటుచేసుకొంటూనే ఉన్నాయి.

కొత్తవారే బాధితులు

హైవేపై ఒకసారి చోరీకి గురైన అనుభవం ఉన్న వారు ఈ ప్రాంతంలో లారీలను నిలపకుండా జాగ్రత్త పడుతున్నారు. ఒక వేళ నిలిపినా తగిన జాగ్రత్తలు తీసుకొని క్యాబిన్‌ను లాక్ చేసుకుంటున్నారు. కానీ కొత్తవారు ఖాళీ స్థలం ఉందని నిలిపి జేబులు ఖాళీ చేసుకొంటున్నారు. మొత్తం సొమ్ము పోగొట్టుకుని దారి ఖర్చులకు కూడా నగదు లేక ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. కొందరైతే యజమానులకు ఏం సమాధానం చెప్పాలో తెలియక సతమతమవుతూ వెళ్తున్నారు. ఈ దయనీయ ఘటనలపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టిసారించి బాధితులకు న్యాయం చేయాలని బాధిత డ్రైవర్లు కోరుతున్నారు.

ఇటీవల జరిగిన ఘటనలు

⇨ గండవరం సబ్‌స్టేషన్ సమీపంలో హైవేపై లారీని ఆపి డ్రైవర్ పడుకున్నారు. ఈ సమయంలో దొంగలు అతడిపై దాడి చేసి నగదును లాక్కెళ్లారు. డ్రైవర్‌ను లారీలో నుంచి తోసేయడంతో చేతికి బలమైన గాయమైంది.

⇨ కోవూరు సమీపంలో నందలగుంట వద్ద ఖాళీ స్థలంలో లారీని ఆపి డ్రైవర్ విశ్రాంతి తీసుకొంటున్నాడు. ఈ సమయంలో దొంగలు అతడి ప్యాంట్ జేబును కత్తిరించి నగదుతో పరారయ్యారు.

⇨ రెండు వారాల వ్యవధిలో రామన్నపాళెం వద్దున్న పెట్రోల్ బంకులో లారీలు ఆపుకొని పడుకున్న ఇద్దరి వద్ద దొంగలు జేబులు కత్తిరించి నగదును దోచుకెళ్లారు. ఇలాంటి ఘటనలు హైవేపై నిత్యం జరుగుతూనే ఉన్నాయి.

నిత్యకృత్యమయ్యాయి



ఇక్కడ లారీ డ్రైవర్ల జేబులు దోచేయడం నిత్యకృత్యమైంది. ఎంతో దూరం ప్రయాణించే వారు కావడంతో ఖాళీ స్థలాలున్న చోట లారీ ఆపుకొని కునుకుతీస్తున్నారు. అలాంటి వారినే లక్ష్యంగా హైవే దొంగలు జేబులను కత్తిరించుకొని వెళ్తున్నారు. ఒకవేళ డ్రైవర్ మేల్కొని తిరగబడితే దాడి చేసి చంపేస్తామని భయపెడుతున్నారు. గత్యంతరం లేక లారీలో దాచి ఉంచిన డబ్బులు సైతం ఇచ్చి మా ఆఫీసులకు వచ్చి గోడు చెప్పుకొంటున్నారు. పోలీసులను ఆశ్రయించమని చెప్పడం మినహా తామేమీ చేయలేని పరిస్థితి ఉంది.

– పవన్ నాయుడు, లారీ సప్లయర్, కోవూరు

అరికట్టాలి



హైవేలపై ప్రయాణించే లారీ డ్రైవర్ల వద్ద బాడుగ నగదు రూ.వేలల్లో ఉంటుంది. అందులోనే వారు దారి ఖర్చులకు వినియోగించుకొంటూ గమ్యం చేరాలి. ఇలా వెళ్లే వారు కొద్దిసేపు సేదతీరే సమయంలో దోపిడీకి గురవుతున్నారు. ఇలాంటి వారు వారంలో ఒకరిద్దరు మా ఆఫీసుకు వచ్చి దారి ఖర్చులకు కూడా లేకుండా దోచేశారని వాపోతున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి హైవే దొంగలను అరికట్టాలి.

– ఆర్.గణపతిరావు, లారీ సప్లయర్, కోవూరు

ప్రసన్న పరామర్శ



రమణయ్యను పరామర్శిస్తున్న ప్రసన్న

కోవూరు: వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు కోటపూరి రమణయ్య రెండో కుమార్తె ధనలక్ష్మి (44) ఇటీవల అనారోగ్యంతో మరణించింది. ఈ క్రమంలో ఆమె ఆదరణ కూడిక మండలంలోని పడుగుపాడులో గురువారం జరిగింది. ఇందులో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరై, కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ నేతలు నిరంజన్‌బాబురెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, పార్టీ మండలాధ్యక్షుడు అతిపల్లి అనూప్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి

విడవలూరు: స్థానిక పీఆర్‌ఆర్‌-వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగే ఉద్యోగ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో డైకిన్, హీరో మోటార్స్ సంస్థల ప్రతినిధులు విచ్చేసి అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో శనివారం ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ శ్రీరామమూర్తిని సంప్రదించాలన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే కేసులు

- సీఐ శివరామకృష్ణారెడ్డి

పొదలకూరు: బస్టాండ్‌లో వ్యాపారులు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే కేసులు పెడతామని సీఐ ఎ.శివరామకృష్ణారెడ్డి హెచ్చరించారు. స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో గురువారం ట్రాఫిక్‌ను సీఐ ఎస్సై హనీఫ్‌తో కలిసి క్రమబద్ధీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్టాండ్‌లో ప్రధానంగా పూల దుకాణాల వ్యాపారులు ట్రాఫిక్‌కు అడ్డంకిగా తయారైనట్లు పేర్కొన్నారు. తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నా వారు ముందుకు చొచ్చుకొస్తున్నట్లు పేర్కొన్నారు. మరో పర్యాయం పరిస్థితి ఇలాగే ఉంటే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. చిరువ్యాపారులు సైతం అడ్డదిడ్డంగా దుకాణాలను ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దని సూచించారు.



పూల దుకాణదారులతో మాట్లాడుతున్న సీఐ

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి



హెల్మెట్లు ధరించి మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



వాహనచోదకురాలికి హెల్మెట్ అందజేస్తున్న సీఐ, ఎస్సై

- సీఐ శివరామకృష్ణారెడ్డి

పొదలకూరు: ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాల్సిందిగా పొదలకూరు సీఐ ఎ.శివరామకృష్ణారెడ్డి సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఎస్సై ఎస్‌కే హనీఫ్ ఆధ్వర్యంలో మోటార్‌బైక్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించి బైక్‌లు నడిపితే ప్రాణాలకు భద్రత ఉంటుందన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి గేటుసెంటర్ వరకు అక్కడి నుంచి సంగం రోడ్డు సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. కాగా దాతల సహకారంతో హెల్మెట్లను అందజేస్తున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో చాట్ల కృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు అవసరం

నేరాల నియంత్రణ, నేరస్తులను పట్టుకోవడంలో కీలకంగా మారిన సీసీ కెమెరాల ఏర్పాటు అవసరం ఎంతో ఉందని సీఐ పేర్కొన్నారు. వీలైనంత వరకు ఇళ్ల వద్ద కూడా వాటిని ఏర్పాటు చేసుకోవాల్సిందిగా సూచించారు.

త్వరితగతిన వాటర్ ట్యాంక్ నిర్మాణం

మనుబోలు: మనుబోలులో వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రెడ్డయ్య సూచించారు. శ్మశానవాటిక ఆవరణలో జరుగుతున్న నిర్మాణాన్ని గురువారం పరిశీలించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.1.3 కోట్ల వ్యయంతో 95 వేల లీటర్ల పరిమాణం గల ట్యాంక్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కండలేరు వాగు వద్ద ఇప్పటికే ఫిల్టర్ పాయింట్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ కసనానాయక్ ఉన్నారు.



ట్యాంక్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఈఈ తదితరులు

ముగ్గురికి ఉపకార వేతనాలు

కలువాయి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్) ప్రవేశపరీక్షలో మండలంలోని చీపినాపి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాలకు చెందిన షేక్ ఖాజానబీ, కార్తీక్, షేక్ రహమాన్ ఈ పథకం కింద ఉపకార వేతనాలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం జనార్దనరెడ్డి గురువారం తెలిపారు. ఈ ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులకు ప్రతి ఏటా రూ.12,000 చొప్పున నాలుగేళ్లపాటు వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేస్తారని వెల్లడించారు. వారిని ఎస్‌ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పోలీసులకు ఫిర్యాదు

కోవూరు: మండలంలోని గుమ్మలదిబ్బలో అధిక వడ్డీ వసూళ్లపై జనసేన నేత శ్రీనివాసులురెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జెడ్పీ సీఈఓ పరిశీలన

నెల్లూరు సిటీ : రూరల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) ఎం.విద్యారమ గురువారం పరిశీలించారు. కార్యాలయంలోని పలు ఫైల్స్‌ను తనిఖీ చేశారు. అనంతరం వివిధ ప్రభుత్వ సర్వేల పురోగతిపై అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ శైలేంద్రకుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైదాపురం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ కోరారు. మండలంలోని ఊటుకూరు గ్రామంలో బుధవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ఉదయం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేసవి కాలంలో రాత్రిళ్లు ఇళ్లకు తాళాలు వేసి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సీఐ చిన సత్యనారాయణ, ఎస్‌ఐ క్రాంతి కుమార్ ఉన్నారు.

బర్డ్‌ఫ్లూపై భయం వద్దు

- పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్ నాయక్

మనుబోలు: బర్డ్‌ఫ్లూపై ఆందోళన చెందొద్దని, ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా ఆ వ్యాధి ఉన్నట్లు నమోదు కాలేదని పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్ నాయక్ తెలిపారు. మనుబోలులోని ప్రాంతీయ పశువైద్యశాలకు ఆయన గురువారం విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉడికించిన చికెన్, కోడిగుడ్లను తినొచ్చన్నారు. జిల్లాలో ఉన్న 19 పౌల్ట్రీ ఫారాలను వైద్యులు పరిశీలించి ఎక్కడా బర్డ్‌ఫ్లూ లేదని నిర్ధారించారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏడుచోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఇతర జిల్లాల నుంచి కోళ్లను రవాణా చేయకుండా అడ్డుకుంటున్నామని తెలిపారు. మనుబోలు మండల పరిధిలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద కూడా చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పలు రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఏడీ గురవారెడ్డి ఉన్నారు.

డిగ్రీ పరీక్షలకు ఇద్దరు విద్యార్థుల గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ మొదటి, నాలుగో సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు తెలిపారు. 24 మందికి గానూ 22 మంది పరీక్షలు రాశారన్నారు.

పేద దంపతులకు పెద్ద కష్టం

- రెండు కిడ్నీలు పాడైపోయిన భర్త
- షుగర్ తీవ్రమై మంచానికే పరిమితమైన భార్య
- దాతల సాయం కోసం ఎదురుచూపులు

మనుబోలు: రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు వారివి. భర్తకు రెండు కిడ్నీలు పాడైపోయాయి. భార్యకు షుగర్ అధికమై తీవ్ర అనారోగ్యం బారిన పడి మంచానికే పరిమితమైపోయింది. దీంతో వారికి పూట గడవడమే గగనమైంది. ఈ నేపథ్యంలో దాతల కోసం ఎదురుచూస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. మనుబోలు మండల కేంద్రంలోని గమళ్లపాళెంలో కుడుమల సుబ్రహ్మణ్యం, లక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు సంతానం. ఇద్దరికి వివాహమైంది. కాగా సుబ్రహ్మణ్యం కల్లుగీత కార్మికుడు. కొంతకాలం క్రితం చెట్లు ఎక్కలేక గీత పనేసి సిమెంట్ బ్రిక్స్ తయారీ ఫ్యాక్టరీలో పనికి వెళ్లేవాడు. ఇటీవల ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించగా రెండు కిడ్నీలు పాడైపోయాయని వైద్యులు తెలిపారు. దీంతో వారానికి రెండుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ప్రభుత్వం డయాలసిస్ పేషెంట్లకు ఇచ్చే పింఛన్ కూడా ఈయనకు రావడం లేదు. దీంతో వైద్యం కోసం అప్పులు చేస్తున్న పరిస్థితి ఉంది. సుబ్రహ్మణ్యం భార్య లక్ష్మీకి షుగర్ ఉంది. అది అధికమై కాళ్లకు ఇన్‌ఫెక్షన్ సోకి మంచానికే పరిమితమైంది. ప్రభుత్వం, దాతలు స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 94919 12838



సుబ్రహ్మణ్యం



లక్ష్మి

పోషకాహారంతో రక్తహీనతకు చెక్



మనుబోలు: జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీడీపీఓ

మనుబోలు: పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణుల్లో వచ్చే రక్తహీనతను నివారించవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. పోషణ్ బీ – పఢాయి బీలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షణ ఇచ్చారు. పౌష్టికాహార ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యాన్ని కాపాడుకోగలమన్నారు. రోజువారీ ఆహారంలో కోడిగుడ్లు, పాలు, ఆకుకూరలు, తాజా కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో పోషక విలువలున్న ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. 3 నుంచి 6 ఏళ్లలోపు చిన్నారుల సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమణమ్మ, పద్మజ, ఆదినారాయణమ్మ, హెచ్‌ఎం రాఘయ్య తదితరులు పాల్గొన్నారు.

- పొదలకూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం పోషణ్ బీ – పఢాయి బీ అనే అంశంపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. 0 – 6 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లల్లో శారీరక, మానసిక అభివృద్ధికి వారు తీసుకోవాల్సిన పౌష్టికాహారం తదితర అంశాలపై వీడియోలను చూపిస్తూ వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ రేణుక, సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల అభివృద్ధికి కృషి

కొడవలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల విద్య, మానసిక, శారీరక, సృజనాత్మక అభివృద్ధికి సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు ఎస్.నిర్మల, టి.నాగభూషణమ్మ సూచించారు. కొడవలూరులోని జెడ్పీ హైస్కూల్‌లో పోషణ్ బీ – పఢాయి బీపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించిన వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏ విధంగా విద్యాబుద్ధులు నేర్పాలి, ఆహారం ఎలా ఇవ్వాలి, మానసికంగా ఏ విధంగా అభివృద్ధి చేయాలో శిక్షణా కార్యక్రమంలో వివరించినట్లు తెలిపారు. వాటిని తప్పకుండా అమలు చేయడం ద్వారా చిన్నారులను అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు.

పక్కాగా అమలు చేయాలి

ఇందుకూరుపేట: పోషణ్ బీ – పఢాయి బీ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని ఎంఈఓ వెంకటేశ్వరనాయక్ అన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ–2 సునీల్‌తో కలిసి శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచే అవసరమైన పోషకాలు ఇవ్వాలని, ఈ మేరకు సిబ్బంది కృషి చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పొదలకూరు: మాట్లాడుతున్న ఎంఈఓ రేణుక



ఇందుకూరుపేట : మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటేశ్వర నాయక్



కొడవలూరు : అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న సూపర్‌వైజర్‌లు